ప్రజాశక్తి

సోమవారం 17 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

భళా..బాలోత్సవం



బాలోత్సవంలో ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యం

- 5 వేల మంది విద్యార్థులతో అట్టహాసంగా వేడుకలు...
- ఏకకాలంలో ఎనిమిది వేదికలపై పలు ప్రదర్శనలు..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలులోని పీవీఆర్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించిన ప్రకాశం బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ ఆనందోత్సాహాల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాల నలు మూలల నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు తరలివచ్చారు. తమ నైపుణ్యాలను కనబరిచేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. విద్యార్థులతో పివిఆర్ గ్రౌండ్స్ కళకళ లాడింది. ఎస్‌పి ఎఆర్.దామోదర్, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు, జిల్లా విద్యాశాఖా ధికారి అత్తోట కిరణ్‌కుమార్, నగర మేయర్ గంగాడ సుజాత, భ్రమర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అధినేత డాక్టర్ సతీష్ ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. బాలోత్సవం నిర్వహణ తీరుపై నిర్వాహకులను ప్రశంసించారు. కార్యక్రమానికి 300 మంది ఉపాధ్యాయులు, వందమంది ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు, వందమంది ఎన్‌సిసి కార్యకర్తలు, పలువురు మహిళా కార్యకర్తలు అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ▶ 5లో



సోషల్‌మీడియా ప్రభావంపై విద్యార్థుల లఘు నాటిక



బాలోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ దామోదర్

చికెన్ తినలేం.. మటన్ కొనలేం..

8లో

కూలీల ఆటో బోల్తా

- ఇద్దరు మృతి
- ఏడుగురికి తీవ్రగాయాలు

3లో

జిబిఎస్ కలకలం

- గులియన్ భారీ సింగ్రోమ్‌తో కొమరోలు వాసి మృతి
- అలసందలపల్లిని సందర్శించిన అధికారులు
- జిల్లాలో మొట్టమొదటి జిబిఎస్ మృతిగా నమోదు
- ఆందోళన వద్దు: స్వామి



అలసందలపల్లి గ్రామంలో పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-కొమరోలు

గులియన్ భారీ సిండ్రోమ్ (జిబిఎస్) వ్యాధితో ప్రకాశం జిల్లాలో కొమరోలు మండల ఆదివారం మృతిచెందారు. జిల్లాలో మొట్టమొదటి జిబిఎస్ మృతి కేసు నమోదైంది. కొమరోలు మండల పరిధిలోని దద్దవాడ గ్రామ పంచాయతీ, అలసందలపల్లిని కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సందర్శించి.. పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైల్ల కమలమ్మ (50), భర్త వెంకటయ్య కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత రెండు వారాల క్రితం కమలమ్మ అనారోగ్యానికి గురైంది. అకస్మాత్తుగా ఈమె కాలు, చేయి పనిచేయకపోవటంతో వెంటనే గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు గుంటూరు జిజిహెచ్ వైద్యశాలకు ఈ నెల 9న తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కమలమ్మ ఆదివారం మృతిచెందారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి డి. బాలశంకర్రావు, డిపిఒ జి.వెంకట నాయుడు, ఈఈ సురేష్‌బాబు, డిఎల్‌పిఒ భాగవతి గ్రామాన్ని సందర్శించారు. ఎంపీడీవో సయ్యద్ మస్తాన్వలి, డాక్టర్ రజితభాను, ఈవోఆర్‌డి బ్రహ్మయ్య, ఆర్ డబ్ల్యుఎస్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామస్తులు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులు మాట్లాడుతూ ఇక్కడ నుంచి తీసుకువెళ్లిన నీరు ఇతరత్రా వాటిని పూర్తి స్థాయిలో పరీక్షలు నిర్వహించి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. గ్రామంలో పైపు లీకేజీలు, ▶ 2లో

పెద్దకొత్తపల్లిలో విషాదం

- పల్నాడులో లారీ ఢీకొట్టడంతో తల్లీకొడుకులు మృతి
- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు
- సీమంతం వేడుకకు వెళ్లి కారులో వస్తుండగా.. ప్రమాదం



మృతిచెందిన నజీమా, నూరుల్లా, హబీబుల్లా (ఫైల్)

ప్రజాశక్తి-పల్నాడు, మద్దిపాడు

సీమంతం వేడుకలో అప్పటివరకు బంధుమిత్రులందరితో సంతోషంగా గడిపారు. అనంతరం తిరుగుప్రమాణమై.. స్వగ్రామం పెద్దకొత్తపల్లికి కారులో వస్తుండగా.. మృత్యువు రూపంలో లారీ ఢీకొంది. దీంతో తల్లి, ఇద్దరు కుమారులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతిచెందడంతో మద్దిపాడు మండలం, పెద్దకొత్తపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన పల్నాడు జిల్లాలో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది.

మద్దిపాడు మండలంలోని పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ నజీమా(50)– కుద్దూస్ దంపతులకు ఇద్దరు కుమారులు. ఏడాది కిందట పెద్ద కుమారుడు షేక్ నూరుల్లా (26)కు వివాహం జరిగింది. కోడలు సీమంతం కార్యక్రమం హైదరాబాద్‌లో బంధుమిత్రుల నడుమ ఘనంగా నిర్వహించారు. వేడుక ముగించుకొని షేక్ నజీమా, ఇద్దరు కుమారులు షేక్ నూరుల్లా, షేక్ హబీబుల్లా(24) స్వగ్రామం పెద్దకొత్తపల్లికి కారులో బయలుదేరారు. పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, పెదనేమిలిపురి వద్ద అద్దంకి–నార్కెట్ పల్లి హైవేపై ఆదివారం వేకువజామున లారీ ఢీకొనడంతో కారులో ఉన్న తల్లి, ఇద్దరు కుమారులు దుర్మరణం చెందారు. నూరుల్లా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. షేక్ హబీబుల్లా వైజాగ్‌లోని కాలేజీలో బీటెక్ ఫోర్త్ ఇయర్ చదువుతున్నాడు. షేక్ నూరుల్లా మరణించాడన్న విషయం తెలుసుకున్న గర్భిణీ అయిన ఆయన భార్యను ఓదార్చడం ఎవరివల్లా కాలేదు. ఇటీవల షేక్ నజీమా భర్తకు హార్ట్ సర్జరీ ఆపరేషన్ జరిగినట్లు బంధువులు తెలిపారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాలోత్సవంలో ప్రతిభ చాటిన 'విశ్వభారతి'

ప్రజాశక్తి-గిద్దలూరు

ఒంగోలు పీవీఆర్ మున్సిపల్ హై స్కూల్‌లో ఆదివారం జరిగిన ప్రకాశం బాలోత్సవం ద్వితీయ పిల్లల పండుగ జిల్లా స్థాయి పోటీలలో విశ్వ భారతి పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి మొత్తం 12 విభాగాలలో బహుమతులు సాధించి పలువురు జిల్లా అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందుకుని తమ ప్రతిభ చాటుకున్నారు. పశ్చిమ ప్రాంతంలో వెనుకబడిన ప్రాంతంగా పేరుగన్న గిద్దలూరు పేరును ఒంగోలు వేదికపై కరతాల ధ్వనులతో గట్టిగా వినిపించేందుకు విశ్వభారతి కారణమైందని పలువురు వ్యాఖ్యానించారు. జానపద నత్యం విభాగంలో "రైతే రాజు" అనే ప్రదర్శనకు మొదటి బహుమతి సాధించగా, ఆహూతులంతా స్టేజ్ మీదికి వచ్చి విశ్వభారతి విద్యార్థులను అభినందించారు. కథారచనలో ప్రశాంత్ ఫస్ట్ ప్రైజసాధించగా, విచిత్ర వేషధారణలో గంటాహన్విత సెకండ్ ప్రైజ్, సైన్స్ ప్రాజెక్ట్‌లో ఎస్ కె సెకండ్ ప్రైజ్,



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న విశ్వభారతి విద్యార్థిని

కోలాటం విభాగంలో విద్యార్థుల సమూహం ఫస్ట్ ప్రైజ్, స్పెల్ బీ విభాగంలో నసీఫా అత్తిక సెకండ్ ప్రైజ్, మ్యాప్ పాయింటింగ్‌లో గురు చరిత సెకండ్ ప్రైజ్, ఉర్దూ ఎస్సే పోటీలో ఎస్.కె అఫ్ షిన్ సెకండ్ ప్రైజ్, ఉర్దూ డిబేట్ పోటీలో ఎస్ కె అఫ్షీన్ ఫస్ట్ ప్రైజ్, పట్టణ వ్యవసాయం – నూతన ఆవిష్కరణ విభాగంలో శివానంద ఫస్ట్ ప్రైజ్, కథారచన విభాగంలో జాస్మిన్ సెకండ్ ప్రైజ్ లు సాధించి విశ్వభారతి పాఠశాల ప్రతిభ ను చాటారు. ఈ బాలోత్సవంలో పాఠశాల విద్యార్థులు మొదటిసారి పాల్గొన్నప్పటికీ, అత్యద్భుతమైన ప్రదర్శన ఇచ్చి ఘన విజయాన్ని సాధించడం పాఠశాలకే కాకుండా, గిద్దలూరు ప్రాంతానికి కూడా గర్వకారణంగా నిలిచిందని పలువురు ప్రశంసించారు. విద్యార్థుల విజయాన్ని పురస్కరించుకుని, పాఠశాల కరస్పాండెంట్ రంగస్వామి రెడ్డి మరియు ప్రిన్సిపాల్ బండారు ఆదిలక్ష్మిలను ఉపాధ్యాయులను అభినందించారు.



డ్రోన్ అందజేస్తున్న టీడీపీ నాయకులు

డ్రోన్ కెమెరా అందజేత

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలో నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ చేపడుతున్న కట్టుదిట్టమైన ఏర్పాట్లకు, పట్టణ తెలుగుదేశం నాయకులు తమవంతు సహకారం అందించారు. ఇటీవల జిల్లా ఎస్‌పి గిద్దలూరు పోలీస్ స్టేషన్ పరిశీలన సమయంలో గిద్దలూరు పట్టణంలో నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలివ్వటంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు పోలీస్ శాఖ సన్నద్ధం అయ్యారు. అదే విధంగా గిద్దలూరు పట్టణంలో నేరాలను అరికట్టేందుకు "డ్రోన్ కెమెరా" ఎంతో ఉపయోగకరమని భావించిన గిద్దలూరు పట్టణ తెలుగుదేశం నాయకులు, డీజీఆర్ టింబర్ డిపో అధినేత వేములపాటి చంటి మరియు మరడ దిలీప్ లు, నూతన డ్రోన్ కెమెరాను ఆదివారం ఉదయం గిద్దలూరు పోలీస్ స్టేషన్ లో పట్టణ సీఐ సురేష్ కి బహుకరించారు.

శత వసంతాలు నిండిన..

గురువుకు పూర్వ విద్యార్థుల సత్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి

తమకు విద్యాబుద్ధులు నేర్పిన రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేమూరి రాఘవయ్య మాస్టారు వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఆదివారం స్థానిక కంచుకోట బజార్‌లోని రాఘవయ్య మాస్టారు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి పరాంకుశం శ్రీనివాస మూర్తి, ఎస్కే ఖాదర్‌వలి మాట్లాడుతూ వేమూరి రాఘవయ్య మాస్టారు చీమకుర్తిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి ఉత్తమ సేవలందించారని పేర్కొన్నారు. ఆయన ఆశీస్సులతో తామందరమూ ఆయా రంగాలలో, ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డామని కొనియాడారు. ఆయన శిష్యులు ఎందరో ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు రాఘవయ్య పంతులు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. వందేళ్లు నిండినా ఆయన తన పనులు తాను చేసుకుంటూ ఉత్సాహంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పరాంకుశం శ్రీనివాసమూర్తి, షేక్ ఖాదర్‌వలి, చలువాది శ్రీనివాసరావు, ఏ శేషయ్య, పోకూరి సుబ్బారావు, మద్ది జగన్మోహన్రావు, కోదాటి శివ నాగేశ్వరరావు, ముద్దనూరు సుబ్బారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాస్టారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రాఘవయ్య మాస్టారును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం జిల్లాపై చిగురిస్తున్న ఆశలు..!

ప్రజాశక్తి-మార్కాపురం

'మార్కాపురం జిల్లా'పై ఆశలు చిగురిస్తున్నట్లు కనిపిస్తోంది. కందుకూరులో జరిగిన 'స్వర్ణ ఆంధ్ర'–'స్వచ్ఛ ఆంధ్ర' సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మాట్లాడిన మాటలు జిల్లా అంశానికి బలం చేకూర్చేలా ఉన్నాయి. టిడిపి శ్రేణులు కూడా ఇటీవల కాలంలో జిల్లా అంశంపై స్వరం పెంచడం గమనార్హం.!



మార్కాపురం జిల్లా ఎప్పుడో కావాల్సింది. ప్రస్తుత జిల్లా కేంద్రం ఒంగోలు పశ్చిమ ప్రకాశానికి దూరంలో ఉంది. మార్కాపురం డివిజన్‌లోని యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, గిద్దలూరు, కొమరోలు, పుల్లలచెరువు, అర్ధవీడు, రాచర్ల, పెద్దారవీడు మండలాల్లోని కొన్ని గ్రామాలు జిల్లా కేంద్రానికి 200 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఏదైనా ప్రభుత్వ కార్యాలయంలో ఈ ప్రాంత ప్రజలు పనుల నిమిత్తం వెళ్లాలంటే రెండు రోజుల సమయం కేటాయించాల్సిందే. ఒంగోలు వెళ్లి తిరిగి గమ్యం చేరేందుకు రోజంతా ప్రయాణించాలి. జిల్లా కేంద్రానికి.... పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం డివిజన్‌కు దూరం పెరగడంతో జిల్లా స్థాయి అధికారులు కూడా మొక్కుబడిగా ఇక్కడ పర్యటిస్తుంటారు. జిల్లా స్థాయి అధికారులు అంతా దూరంలో ఉన్నందున ఇక్కడి అధికారులు, సిబ్బంది ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో ఉండరు. సరైన సమయ పాలన పాటించరు. ఈ కారణంగా పరిపాలనా సౌలభ్యం కూడా తక్కువనే చెప్పాలి.

మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లా అవసరమని ఇక్కడి ప్రజల్లో బలంగా ఉంది. గత ప్రభుత్వ కాలంలో జిల్లాల పునర్విభజన తరుణంలో మార్కాపురం జిల్లా అవుతుందని ఇక్కడి ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. పార్లమెంటు స్థానాలు ప్రామాణికంగా తీసుకోవడంతో మార్కాపురం జిల్లాగా నోచుకోలేదు. గతంలో మార్కాపురం కూడా ఓ పార్లమెంటు స్థానమనేది గత ప్రభుత్వం గుర్తించలేదు. ప్రధానంగా మార్కాపురం డివిజన్ జిల్లా కేంద్రం ఒంగోలుకు విసిరేసినట్లుగా ఉందన్న విషయాన్ని కూడా పట్టించుకోలేదు. జిల్లాల ప్రక్రియ మొదలైన సమయంలో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమం నడిచింది. మార్కాపురం జిల్లా కోసం అఖిలపక్ష రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు ఉద్యమంలో పాల్గొన్నాయి. జిల్లాల ప్రక్రియ ముగిసింది. మార్కాపురం ప్రత్యేక జిల్లాకు నోచుకోలేదు.

ఇంతలో ఎన్నికలొచ్చాయి. మార్కాపురం జిల్లా అంశం తెరపైకి వచ్చింది. టిడిపి అధినేత చంద్రబాబు మార్కాపురం జిల్లాపై హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. సిఎం చంద్రబాబుతో మార్కాపురం జిల్లా విషయంపై మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రస్తావించారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటామని సిఎం చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి బాపట్ల జిల్లాలో ఉంది. కందుకూరు నెల్లూరు జిల్లా పరిధిలోకి పోయింది. అద్దంకి, కందుకూరు ప్రాంతాల ప్రజలకు బాపట్ల, నెల్లూరు అనుకూలంగా లేదు. అక్కడి ప్రజలకు ఒంగోలు సౌలభ్యం. అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలు పాత ప్రకాశంలో విలీనం చేస్తే... ఖచ్చితంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు తథ్యమనేది ఇక్కడి టిడిపి నేతల వాదన.

తాజాగా కందుకూరు సభలో పాల్గొన్న సిఎం చంద్రబాబును అక్కడి ప్రజలు కందుకూరు ఒంగోలులో ఉండాలని కోరారు. దీనిపై చంద్రబాబు స్పందించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల ప్రతిపాదనలు వస్తున్నాయి. త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ఆ తరుణంలో మీరనుకున్నట్లుగా జరుగుతుందని సూచాయగా చెప్పడం జరిగింది. దీంతో కొంత కాలం జాప్యం జరిగినా... 'మార్కాపురం జిల్లా' ఏర్పాటు ఖాయమనే చర్చ జరుగుతోంది.!

'జిబిఎస్' కలకలం

(మొదటిపేజీ తరువాయి)

పారిశుధ్య ఇబ్బందులు ఏమీ లేవన్నారు. అయినప్పటికీ ఏ విధంగా జిబిఎస్‌కు గురయ్యారో పరీక్షల అనంతరం తేల్చాల్సి ఉంటుందన్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగటం, డిసీజ్డ్ మాంసాహారాన్ని తినకుండా ఉండటం.. ఇలా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిఈ నవకిషోర్, పంచాయతీ కార్యదర్శి రమణయ్య, వైద్య సిబ్బంది రజిని, కిరణ్, లక్ష్మీదేవి, డిఆర్‌పిలు చక్రధర్, సురేష్ పాల్గొన్నారు.

బిజిఎస్‌పై ఆందోళన చెందొద్దు

గులియస్ బారే సింద్రోమ్(జిబిఎస్) వ్యాధిపై జిల్లా ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. బిజిఎస్ వ్యాధితో గుంటూరులో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై మంత్రి స్పందించారు. బిజిఎస్ అంటు వ్యాధి కాదని, ఈ వ్యాధికి అన్ని ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే డాక్టర్లు వెంటనే తగిన వైద్యం అందించాలన్నారు. ఈ విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమీక్ష చేశారన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లా అధికార యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని మంత్రి స్వామి సూచించారు.



నూతన వధువును ఆశీర్వదిస్తున్న మంత్రి స్వామి

నూతన వధువుకు మంత్రి ఆశీర్వాదం

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని మన్నె కిషోర్, సుమతి కుమార్తె విష్ణుప్రియ వివాహ వేడుకలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి హాజరయి వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దామచర్ల శ్రీమన్నారాయణ, దామచర్ల విజయలక్ష్మి, మన్నె అజయ్‌బాబు–మాధవి, నలమోతు కృష్ణవేణి, దామచర్ల పిచ్చన్న హాజరయి వధువును ఆశీర్వదించారు.



మోహనరావుకు నివాళులర్పిస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

మోహనరావుకు మంత్రి నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం సూరారెడ్డిపాలెం గ్రామంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, తుళ్లూరి మోహనరావు పెద్దకర్మలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సూరారెడిడ్డపాలెం ఉప సర్పంచి మెలకలపల్లి కోటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి మెలకలపల్లి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు మెలకలపల్లి రామకృష్ణ, మెలకలపల్లి వెంకటరావు గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

సోమవారం 17 ఫిబ్రవరి 2025

కూలీల ఆటో బోల్తా



ఘటనాస్థలంలో గాయాలతో మహిళా కూలీలు

ఇద్దరు మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మిర్చి కూలీలు ప్రయాణిస్తున్న ట్రాలీ ఆటో వెనుక టైరు పగిలి అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా ఏడు మందికి తీవ్ర గాయాలు, పలువురికి స్వల్ప గాయాలైన ఘటన మండల పరిధిలోని నికరంపల్లి గ్రామ సమీపంలోని అనంతపురం టు అమరావతి జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. అందిన వివరములు ప్రకారం.. మార్కాపురం పట్టణ పరిధిలోని కొండారెడ్డికాలనీ, కొండేపల్లి రోడ్డు డౌన్ ప్రాంతానికి చెందిన 25 మంది మహిళా కూలీలు మిర్చి కోతల నిమిత్తం పెద్దారవీడు మండలం సట్లమెట్ల గ్రామానికి వెళ్లారు. సాయంత్రం సమయంలో కోత పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాద స్థలి వద్దకు రాగానే కూలీలు ప్రయాణిస్తున్న ఆటో వెనుక టైరు ఒక్కసారిగా పగిలిపోవడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలందరూ ఒకరిపై ఒకరు పడి ఒక్కసారిగా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, వాహనదారులు హుటాహుటిన క్షతగాత్రులైన మహిళా కూలీలను ఒక ప్రైవేట్ వాహనంతో పాటు పలు అంబులెన్స్‌లో మార్కాపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. మార్గమధ్యంలో మార్కాపురం పట్టణం కొండారెడ్డి కాలనీకి చెందిన షేక్ మున్ని(47) మృతి చెందింది. మరో మహిళా ఏ.లక్ష్మీదేవికి తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. ఒంగోలులోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఏ.లక్ష్మీదేవి(55) మృతి మృతి చెందింది. కూలీల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల వద్దకు చేరుకుని బోరున విలపించారు. మార్కాపురం వైద్యశాలలో క్షతగాత్రులను దించేందుకు తగిన సిబ్బంది, స్ట్రెచర్లు లేకపోవడంతో స్థానిక యువకులే అంబులెన్స్ నుంచి క్షతగాత్రులను వైద్యశాల లోపలికి తరలించారు. మార్కాపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మార్కాపురం సిఐ పి.సుబ్బారావు, గ్రామీణ ఎస్ఐ అంకమ్మరావు వైద్యశాలకు చేరుకొని క్షేత్రగాత్రుల నుంచి వివరాలు సేకరించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూలీలందరికీ మెరుగైన వైద్య సేవలు త్వరితగతిన అందించాల్సిందిగా వైద్యులను ఆదేశించారు.



వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలు

ఆటో, కారు ఢీ.. నలుగురికి గాయాలు

చీరాల: ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చీరాల మండలం ఈపురుపాలెం రహదారిలోని ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో ఆదివారం జరిగింది. అందిన వివరాల మేరకు.. ఈపురుపాలెం నుంచి చీరాల వెళ్తున్న ఆటోకు గడ్డివామి వామనం ఎదురుగా కావడంతో క్రాస్ క్రమంలో ఆటో డ్రైవర్ రాంగ్ రూట్‌ని వెళ్లాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఆటో పూర్తి దెబ్బతింది. ఆటోలో మొత్తం ఆరుగురు ఉండగా బురదగుంట కరుణ, మేరీ తీవ్రంగా గాయపడగా మంగమ్మ, స్వాతి, ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో ప్రయాణికులు ఆటోలోనే ఇరుక్కుపోయి భయభ్రాంతులు చెంది పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి గడ్డ పలుగుల సాయంతో వారిని సురక్షితంగా బయటికి తీశారు. ఈ ప్రమాదంలో ఓ బాలింత పసి బిడ్డతో ఉన్నప్పటికీ తృటిలో ఆమె ప్రమాదం నుంచి తప్పించుకోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఔట్ పోస్ట్ పోలీసులు క్షతగాత్రుల నుండి వివరాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ధ్వంసమైన ఆటో

కారు బోల్తా, ముగ్గురికి గాయాలు

పంగులూరు: వేగంగా ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా టైరు పేలటంతో కారు బోల్తా పడి ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని జాగర్లమూడివారిపాలెం దగ్గర జాతీయ రహదారి ఫ్లైఓవర్‌పై ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బి.రామ సుబ్రహ్మణ్యం కుటుంబం వైజాగ్ నుంచి కడపకు కారులో బయలుదేరింది. ఆదివారం జాగర్లమూడి వారిపాలెం ఫ్లైఓవర్ పైకి రావడంతోనే కార్ టైర్ ఒక్కసారిగా పేలింది. దీంతో కారు ఫ్లైఓవర్ పైనే బోల్తా కొట్టింది. ఆ సమయంలో కారులో రామసుబ్రహ్మణ్యంతో పాటు అతని భార్య వెంకటసుబ్బలక్ష్మి, వీరి కు మార్తె ఉన్నారు. వీరికి గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. రేణింగవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తా పడిన కారు

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెందిన వివాహిత సల్ఫాస్ బిళ్లలు తిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పుగుండూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన మాగులూరి నాగమల్లేశ్వరి (50), మురళీకృష్ణ దంపతులు. వీరి మధ్య నగదు విషయంలో వివాదం చోటుచేసుకుంది. దీంతో మనస్థాపానికి గురైన నాగమల్లేశ్వరి శనివారం రాత్రి శనగల్లో ఉపయోగించే సల్ఫాస్ మందు తినింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించగా చికిత్స పొందుతూ నాగ మల్లేశ్వరి ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు యశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-కంభం

ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం జగ్గంబోట్ల కృష్ణాపురం గ్రామానికి చెందిన కటికల శ్యామల (35) వాస్మాల్ తాగి మృతి చెందింది. ఆమె కంభం గ్రామంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల బెంగుళూరు అయ్యంగార్ బేకరీలో పని చేసి జీవిస్తోంది. ఆదివారం పనికి అని చెప్పి వెళ్లిన శ్యామల కంభంలోని అయ్యంగార్ బేకరీ ఎదురుగా వాస్మాల్ తాగింది. అది చూసిన స్థానికులు 108 వాహనానికి ఫోన్ చేసి హాస్పిటల్‌కి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈవిడ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

నకిలీ నోట్ల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-మేదరమెట్ల

నకిలీ నోట్లు మారుస్తున్న ముఠాను మేదరమెట్ల పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రికి చెందిన మాదాసి నరేంద్ర, అద్దంకికి చెందిన సురేష్, ఏసురత్నంలు కడప జిల్లాకు చెందిన రామేశ్వర్ రెడ్డికి లక్షకు మూడు లక్షలు నల్లధనం ఇస్తామని నమ్మించారు. జనవరి 27వ తేదీన రామేశ్వర్ రెడ్డిని మేదరమెట్ల రప్పించుకుని ఒక బ్యాగ్‌లో నకిలీ నోట్ల కట్టలు పెట్టి పైవరుసలో ఒరిజినల్ నోట్లు పెట్టి ఇచ్చి వెళ్లిపోయారు. రామేశ్వర్ రెడ్డి తరువాత నగదు చూసుకుని అవి నకిలీ నోట్లుగా గుర్తించి ఫిబ్రవరి 14వ తేదీన మేదరమెట్ల స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై మహమ్మద్ రఫీ చీటింగ్ కేసును చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితులు మాదాసి నరేంద్ర, అతనికి సహకరిం చిన సురేష్, యేసు రత్నంలను అరెస్టు చేశారు. వీరి నుంచి నకిలీ నోట్లు, కారును స్వాధీనం చేసుకున్నారు.



స్టేషన్ బయట రెండు గ్రూపులను చెదరగొడుగున్న పోలీసులు

స్టేషన్‌లోకి రాయి విసిరిన మహిళ

ప్రేమ జంట స్టేషన్‌లో ఉండగా ఘటన

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఓ ప్రేమ జంట ఆదివారం శింగరాయకొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. జంటకు సంబంధించిన రెండు గ్రూపులు స్టేషన్ బయట ఉన్నారు. ఈ క్రమంలో ఓ మహిళ అభం శుభం తెలియని అమ్మాయిన లేపుకుపోతారా అంటూ స్టేషన్‌లోకి రాయి విసరడం కలకలం రేపింది. చివరికి ఆ రాయి ఏఎస్ఐ మోచేయి తగలడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇరువర్గాలకు చెందిన వారిని చెదరగొట్టారు. ఈ విషయంపై పోలీసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే శింగరాయకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఇదేమీ కొత్త కాదని, వారానికి ఒకసారి ఇలాంటి సంఘటన జరుగుతూనే ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. గత వారంలో బింగినపల్లి గ్రామానికి చెందిన ఓ ప్రేమ జంట పోలీస్ స్టేషన్ వద్దకు రాగా ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు గొడవ పెట్టుకున్నారు. ఆదివారం కూడా ఓ ప్రేమ జంట వ్యవహారంలో గొడవ జరగటం, ఏఎస్ఐకి గాయం కావడం శింగరాయకొండలో చర్చనీయాంశంగా మారింది.

పందుల కోసం ఏర్పాటు చేసిన..

ఉచ్చులో పడి చిరుత మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో చిరుతపులి మృతి చెందింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. గంజివారిపల్లి పరిసర గ్రామాలకు చెందిన కొందరు అడవి పందుల కోసం ఉచ్చులు బిగించగా కొలుకుల, గంజివారిపల్లి గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో చిరుత వచ్చి ఆ ఉచ్చుల్లో పడింది. చిరుత బయటకు రాలేక అరవగా చుట్టుపక్కల గ్రామాల వారు విన్నట్లుగా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అటవీశాఖ అధికారులు చిరుతను రక్షించటానికి ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రయత్నాలు ఫలించలేదు. మృతి చెందిన చిరుతపులి నాలుగు సంవత్సరాల వయసు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులను వివరణ కోరగా పోస్టు మార్టం అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రఫీ

విధిగా హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-మేదరమెట్ల

ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ మహమ్మద్ రఫీ అన్నారు. మేదరమెట్ల బైపాస్ రోడ్డులో ఆదివారం వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ప్రజలకు వివరించారు.

దేవాంగ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

మహిళా విభాగం అధ్యక్షురాలిగా తిరుమలదేవి

ప్రజాశక్తి-వేటపాలెం

ఆంధ్రప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘం కమిటీ సమావేశం విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్రంలోని 26 జిల్లాల దేవాంగ ప్రతినిధులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి వేటపాలెం మండలానికి చెందిన జడ్పీటీసీ బండ్ల తిరుమల దేవిని ఆంధ్రప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీరాల మండలం దేవాంగపురి చెందిన చీరాల మాజీ జడ్పీటీసీ పృద్వి అరుణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం మహిళ విభాగానికి ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధికార ప్రతినిధిగా పందిళ్ళపల్లికి చెందిన యారాసు అరుణ్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పసుమర్తి మల్లికార్జునరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా గుంటూరు మధుసూదన్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా చల్లా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నక్కిన చిన్న వెంకటరాయుడు వీరిచేత ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



తిరుమలదేవి

ఇంజినీర్ నోరి గోపాలకృష్ణమూర్తికి నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి బాపట్ల ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేసిన సుప్రసిద్ధ ఇంజనీరుగా నోరి గోపాలకృష్ణమూర్తి దేశానికి ఎనలేని సేవలు అందించారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయి బాబు అన్నారు. ఆదివారం నోరి గోపాలకృష్ణమూర్తి 115వ జయంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో పటేల్ నగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ బాక్రా నంగల్ డ్యాం, కోయిన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ వంటి పలు ప్రాజెక్టులకు ఆయన రూపశిల్పిగా ఉన్నారని తెలిపారు. 1963లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్ పురస్కారాలను అందుకున్నారన్నారు. ఇంటర్నేషనల్ లార్జ్ డ్యామ్స్ కాంగ్రెస్‌కు ఉపాధ్యక్షుడిగా, ఇండో బాంగ్లాదేశ్ జాయింట్ రివర్ కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించారని తెలిపారు. నేటితరం ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



నోరి గోపాలకృష్ణమూర్తికి నివాళులర్పిస్తున్న దృశ్యం




పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కొండయ్య

అభివృద్ధికి టిడిపి పెద్ద పీట

ఎమ్మెల్యే కొండయ్య సమక్షంలో 150 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ పెద్దపేట వేస్తుందని ఆదిశగా సిఎం చంద్రబాబు ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పాలిపోయిన పెద్ద అంకిరెడ్డి, కావూరి యద్దలరెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామస్తులు 150 కుటుంబాలు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానం పలికారు. ప్రభుత్వ పథకాలను పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శీను, కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.



నారా భువనేశ్వరితో ఎమ్మెల్యే ఏలూరి

భువనేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఎన్టీఆర్ ట్రస్ట్ 28 ఏళ్ల పూర్తిచేసుకున్న సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్టీఆర్ ట్రస్టు సేవలను కొనియాడారు. ట్రస్టుద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

యునిక్ ఐడీతోనే రైతులకు ప్రభుత్వ పథకాలు

ఏడీఏ కె.నీరజ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వ్యవసాయ రంగంలో అన్నదాతల సంక్షేమం, సాగు పెట్టుబడి సాయం కోసం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని యర్రగొండపాలెం వ్యవసాయ సహాయ సంచాలకులు కె నీరజ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఈ పథకాలను అర్హులకు మాత్రమే అందేలా ప్రభుత్వాలు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయన్నారు. దీనిలో భాగంగా నిజమైన లబ్ధిదారులకు మేలు జరిగేలా వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికరించేందుకు రైతులకు ఆధార్ కార్డు తరహాలో ఒక యూనిక్ ఐడిని కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట ప్రతి రైతుకు నిర్దిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చే ప్రక్రియ అనేక రాష్ట్రాలలో ప్రారంభమైందన్నారు. అనర్హులకు అడ్డుకట్ట వేసి అర్హులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఇతర వ్యవసాయ సేవలు అందించడానికి ఈ గుర్తింపు సంఖ్య ఉపయోగపడుతుం దని అన్నారు. నమోదు కోసం కావాల్సిన ధవపత్రాలు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీ, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నెంబర్, తీసుకొని రైతు సేవ కేంద్రానికి వెళితే అక్కడి సిబ్బంది రైతుల సమక్షంలోనే ఈ విశిష్ట సంఖ్య కోసం కంప్యూటర్‌లో నమోదు చేస్తారన్నారని ఆమె వివరించారు.

వంగతోట..

వంకాయలు కిలో రూ.5

కూలీ ఖర్చులు రావని.. కాయలతో సహా మేతకు ఇచ్చిన రైతు

జీవాలకు మేత



వంగతోటలో మేస్తున్న గొర్రెలు

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన ఉప్పాల నరసింహ అనే రైతు అతనికి ఉన్న రెండు ఎకరాల సొంత భూమిలో మొక్కజొన్న సాగు చేసి అర ఎకరం భూమిని కౌలుకు తీసుకొని, అందులో వంగతోట సాగు చేశాడు. ఈ భూమికి నీటి వసతి ఉండటంతో రూ.15 వేలు పెట్టుబడి పెట్టాడు. తోట ఏపుగా పెరిగింది. కాయలు కూడా బాగానే కాసాయి. కాయలు కోసి అమ్ముకునేందుకు సిద్ధమయ్యాడు. మార్కెట్‌లో వంకాయలు కేజీ రూ.5 చెప్పడంతో కూలీల ఖర్చులు కూడా రావని గొర్రెలు మేపుకోవడానికి ఉచితంగా ఇచ్చేశారు. మార్కెట్లో ఒక్క వంకాయలకే కాకుండా, కూరగాయలన్నిటి పరిస్థితి ఇదే విధంగా ఉంది. కూరగాయలు పండించిన రైతులకు నష్టాలు తప్పడం లేదు. మార్కెట్ మాయాజాలంలో చిక్కుకొని విలవిలాడుతున్నారు. రైతుకు గిట్టుబాటు కానీ కూరగాయలు వినియోగదారుడికి మాత్రం చుక్కలు చూపిస్తున్నాయి.

కాయలు కోసినా కూలీ ఖర్చులు కూడా రావు

కాయల కోతకు మనిషికి రూ.300 కూలీ ఇవ్వాలి. ఖాళీ గోతం, మార్కెట్ దగ్గర పది రూపాయలు కమిషన్ ఇవ్వాలి. ఒక గోతం కాయలు రవాణా ఖర్చు రూ.50 ఉంటుంది. ఈ లెక్కన ఒక్కొక్క గోతానికి రూ.410 అవుతాయి. ఒక గోతంలో 60 కిలోలు మాత్రమే కాయలు పడతాయి. అంటే



ఒక గోతం కాయలు తీసుకెళ్తే వచ్చేది రూ.300 మాత్రమే. అందుకు అయ్యే ఖర్చు రూ.410. ఇంత కష్టపడి పెట్టుబడి పెట్టి కాయలు తీసుకొని మార్కెట్‌కి వెళ్లినా గోతానికి రూ.110 నష్టపోవాల్సి వస్తుంది. అందుకే వంకాయలు కోయకుండా చేను మొత్తాన్ని గొర్రెలు మేపుకునేందుకు ఉచితంగా ఇచ్చాను.

-ఉప్పాల నరసింహ, కోటపాడు

కరాటే విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకిలోని వెంకటేశ్వర కల్యాణ మండపం, గీతా మందిరంలో జాతీయస్థాయి కరాటే పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను చీఫ్ ఆర్గనైజర్ పి.రాంబాబు, ఆల్ ఇండియా ప్రెసిడెంట్ జి సాయిరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, చిన్ని శ్రీనివాసరావు, సీతారామయ్య, వడ్లవల్లి పూర్ణచంద్రరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, మలాది శ్రీనివాసరావు తదితరులు విచ్చేశారు. విజేతలకు అతిథుల చేత శాలువాలు, సర్టిఫికేట్లు, కప్పులు బహూకరించారు. పోటీలలో కరాటే రాష్ట్ర



బహుమతులతో కరాటే విజేతలు

అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ మాట్లాడుతూ పి.రాంబాబు గత 20 సంవత్సరాలుగా గుంటూరులో ప్రతిసంవత్సరం జాతీయస్థాయి పోటీల్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. చీఫ్ ఆర్గనైజర్ పి.రాంబాబు మాట్లాడుతూ ఈ పోటీలకు 6 రాష్ట్రాల నుంచి 650 మంది పాల్గొన్నారని, ఓవరాల్ చాంపియన్స్‌గా నరసరావుపేట టీం విజయం సాధించిందన్నారు. స్థానిక కరాటే మాస్టర్ వెంకటరత్నం ఇతర మాస్టర్లు ఈ కార్యక్రమానికి సహకరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం అయినందుకు కరాటే మాస్టర్లు రాంబాబు టీంకు అభినందనలు తెలియజేశారు.

గొంతెండుతున్న గ్రామాలు

మూలనపడిన రక్షిత మంచినీటి పథకాలు

వినియోగంలోకి రాని జల జీవన్ మిషన్

నినాదంగానే మిగిలిన ఇంటింటికీ కుళాయి

ప్రజాశక్తి-బాపట్ల

తాగునీటికి గ్రామాలు తల్లడిల్లుతున్నాయి. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యం ప్రచారానికే పరిమితమైంది. ఊరి మొత్తానికి కలిపి ఒక్క కుళాయి కూడా లేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. బాపట్ల నియోజకవర్గంలో తాగునీరు అందించే విషయంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏళ్ల తరబడి రక్షిత మంచినీటి పథకాలు మూలనపడి పడి వెక్కిరిస్తున్నాయి.

జలజీవన్ మిషన్ కింద ప్రతి గ్రామానికి మంచినీళ్లు ఇస్తాం.. ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇస్తామని ప్రభుత్వం పదే పదే చెబుతోంది. అయితే ఇంటికి కాదు..కాదా ఊరికి కూడా ఒక్క కొళాయి కనెక్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితి అనేక గ్రామాల్లో నెలకొని ఉంది. గ్రామాల్లో మంచినీరు లేకపోవడంతో బయట ప్రాంతాల నుంచి నీరు కొనుక్కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నేటికీ కొనసాగుతోంది. కొన్ని దశాబ్దాలుగా ఈ పరిస్థితి ఆ గ్రామాలకు తప్పడం లేదు.



ముత్తాయపాలెంలో నీటి కోసం మహిళల పాట్లు

బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం మండలంలో అనేక గ్రామాలు తాగునీటి కోసం తల్లడిల్లి పోతున్నాయి.

తాగునీటికి నోచుకోని నాగరాజుపాలెం

మండలంలో వందేళ్ల క్రితం ఏర్పడిన నాగరాజు పాలెం గ్రామంలో ఇప్పటికీ మంచినీటి సౌకర్యం లేదు. గ్రామంలోని చెరువు ఎందుకూ పనికి రాకుండా ఉంది. సమీపంలోని గ్రామాలకు వెళ్లి మంచినీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ గ్రామంలో ఇదొక దయనీయమైన పరిస్థితి. అయినా పాలకులకు ఏమాత్రం పట్టదు. విచిత్రమైన విషయం ఏమిటంటే గత ప్రభుత్వ హయాంలో ఈ గ్రామానికి జలజీవన్ మిషన్ కింద రూ.20 లక్షలు కేటాయించారు. చెరువే లేని ఈ గ్రామంలో జలజీవన్ మిషన్ కింద పనులు ఎలా చేపడతారో తెలియక చాలామంది ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆ నిధులు కాస్త పక్కనే ఉన్న బోలాయపాలెం గ్రామానికి వెచ్చించారు. ఏళ్ల తరబడి మంచినీళ్ల కోసం ఈ గ్రామం తల్లడిల్లిపోతూనే ఉంది. ఇదే మండలంలోని బోలాయపాలెంలో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించి ఎస్ఎస్ ట్యాంకు ఏర్పాటు అయింది. ప్రారంభానికి నోచుకోక మూలన పడి మూలుగుతోంది. ఈ మండలంలోని దుండివారిపాలెంలో 2010లో అప్పటి బాపట్ల శాసనసభ్యులు గాదె వెంకటరెడ్డి హయాంలో రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. దీనికోసం 9 ఎకరాల చెరువును ఏర్పాటు చేశారు. రెండు మూడేళ్లు మాత్రమే ఇది పనిచేసింది. బోలాయపాలెం, దుండివారిపాలెం శ్రీరామ్ నగర్, బిడారు దిబ్బ తదితర ప్రాంతాలకు ఎంతో వెసులుబాటుగా ఉండే ఈ పథకం ఇప్పుడు ఎందుకూ పనికి రాకుండా నిరార్ధకంగా పడి ఉంది.

తీవ్రరూపం దాల్చనున్న నీటి ఎద్దడి

బాపట్ల నియోజకవర్గంలోని తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. వేసవికాలం కావడంతో ఈ సమస్య మరింత



తీర ప్రాంతంలోని ఓ గ్రామంలో రక్షిత మంచినీటి పథకం

జటిలమయ్యే అవకాశం ఉంది. అధికారుల పాలకుల స్పందన మాత్రం ఇక్కడ కనిపించడం లేదు. ఎన్నికలకు ముందు మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు అనేక హామీలు ఇచ్చారు. తీర ప్రాంత గ్రామాల చెరువుల్లో నీరింకకుండా నూతన టెక్నాలజీని వినియోగించి ప్రతి గ్రామానికి త్రాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు దాని ఊసే లేదు. పరిస్థితి త్రాగునీటి పరిస్థితి తీవ్ర రూపం దాల్చకముందే అధికారులు పాలకులు పట్టించుకుని బాపట్ల నియోజకవర్గంలో త్రాగునీటి ఎద్దడి నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వేగేశన ఫౌండేషన్ ద్వారా తాగునీరు..

తీవ్రంగా తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న బాపట్ల నియోజకవర్గంలో అనేక గ్రామాలకు వేగేశన ఫౌండేషన్ ద్వారా ఇంటింటికి త్రాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే బిందె నీళ్లు ఐదు రూపాయలకు కొనుక్కోవాల్సి వస్తుంది. ఫౌండేషన్ ద్వారా త్రాగునీటి సరఫరాకు కనీస వాహన ఖర్చులు నిర్వహణకు మాత్రమే బిందెడు నీళ్లకు ఐదు రూపాయలు వసూలు చేస్తున్నారు. మొత్తంగా బాపట్ల నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు అటు పాలకులు, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజాశక్తి
సోమవారం 17 ఫిబ్రవరి 2025

పిల్లల పండుగ..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

బాలోత్సవాలు బాలల భవితకు బంగారు బాటవేస్తాయని పలువురు వక్తలు కొనియాడారు. బాలల భవిష్యత్తు కోసం బాలోత్సవం పేరున పలు విజ్ఞానదాయకమైన కార్యక్రమాలు నిర్వహించటం అభిలషణీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఒంగోలులోని పివిఆర్ పాఠశాలలో ఆదివారం అట్టహాసంగా బాలోత్సవం వేడుకలు నిర్వహించారు. వేలాది మంది పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానం అవసరం అని, ఆ విజ్ఞానాన్ని వెలికితీసేందుకు కృషి చేస్తున్న బాలోత్సవ కమిటీ నిర్వాహకులను ఆయన అభినందించారు. తొలుత ఆయన సైన్స్ వైజ్ఞానక ప్రదర్శనలు పరిశీలించి.. విద్యార్థులను ప్రశంసించారు. జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకాశం బాలోత్సవం ప్రకాశం జిల్లా ప్రగతికే కాదని, దేశ అభ్యున్నతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎన్ని అవాంతరాలు ఉన్నప్పటికీ, ప్రతికూల పరిస్థితుల్లోనూ బాలోత్సవం నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ప్రజ్ఞా పాటవాలను వెలికి తీసేందుకు బాలోత్సవం కమిటీ చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన భ్రమరా టౌన్షిప్ అధినేత డాక్టర్ సతీష్ మాట్లాడుతూ బాలోత్సవం తలపెట్టిన యజ్ఞం దేశ ప్రగతికి, సమాజ అభివద్ధికి దోహదపడుతుందన్నారు.

8 వేదికలపై లఘునాటికలు, జానపద నత్యాలు, ఏకపాత్రలు, కోలాటం, సైన్స్ ఎగ్జిబిషన్, చిత్రాలేఖనం, మట్టితో బొమ్మలు, పలు సాంస్కతిక ప్రదర్శనలు అలరించాయి. 13 కమిటీలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాయి. తొలుత బాలోత్సవ కమిటీ అధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ బాలోత్సవ జెండాను ఆవిష్కరించి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డిసిఈబి సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు, బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు ఏ.వి. రమణారెడ్డి, అమరావతి బాలోత్సవం కార్యదర్శి యు.వి.రామ రాజు, యూ.టి.యఫ్. రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, ఎంఈఓలు కిషోర్ బాబు, బాలాజీ, బాలోత్సవ కమిటీ నిర్వాహకులు కె.సుబ్రహ్మణ్యం, డి. వీరాంజనేయులు, ఎస్ రవి, జి.ఉమామహేశ్వరి, అబ్దుల్ హై, సిహెచ్.జయప్రకాశ్ రావు, దామా శ్రీనివాసరావు, సి. హెచ్.వినోద్, కె.యఫ్.బాబు, వి.బాలకోటయ్య, డి.యల్.ప్రసాద్, యస్.కె. ఖాజాహుస్సేన్, ఆర్.యన్.సురేష్, యు.భాస్కర్, బి.తిరుపతయ్య, మండ్ల శ్రీనివాసులు, యన్.చిన్నస్వామి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు టి. నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

- బాలల భవితకు భరోసా 'బాలోత్సవం'
- అలరించిన సాంస్కతిక కళా ప్రదర్శనలు...
- ఆకట్టుకున్న సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు..
- ప్రారంభ సభలో పాల్గొన్న ఎస్పీ దామోదర్, ఎమ్మెల్యే జనార్ధన్, మేయర్ సుజాత

సృజనాత్మకతను వెలికితీసే 'బాలోత్సవం'

ఎస్పీ దామోదర్

సృజనాత్మకతను వెలికితీసేందుకు, దేశభక్తి మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రీడలు, సాంస్కతిక, విద్యార్థుల మధ్య ఐక్యత, విద్యార్థుల ఆలోచన విధానాన్ని మార్చేందుకు చదువుల పట్ల ఇష్టాన్ని పెంచేందుకు బాలోత్సవాలు దోహదపడతాయని ప్రకాశం జిల్లా ఎస్పీ ఆర్ దామోదర్ పేర్కొన్నారు. బాలోత్సవం నిర్వాహకులను ప్రశంసించారు. బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షులు డి.వీరాంజనేయులు అధ్యక్షతన జరిగిన బాలోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అయన మాట్లాడుతూ విద్యార్థులలో నైపుణ్యం సాధించే దిశగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ వాడే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. గత 6, 7 నెలల్లో ఎందరో హెల్మెట్ ధరించని కారణంగా అసువులుబాసి కుటుంబాలలో విషాదం నింపిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. తల్లి జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మనిస్తుందన్నారు. హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత మరియు మీ కుటుంబం యొక్క ఆనందం గురించి ఆలోచించాలన్నారు. మత్తు పదార్థాలు నిరోధానికి కషి చేయాలని, ఎవరైనా డ్రగ్స్ వాడుతున్న విషయం తెలిస్తే 1972,100 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. అనంతరం వ్యాసరచన వక్తత్వ, చిత్రలేఖనం, కోలాటం ఏకపాత్రాభినయం మట్టితో బొమ్మలు, నత్య ప్రదర్శనలు తదితర అకడమిక్, కల్చరల్ 57 అంశాలపై పోటీలలో ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందించారు. బహుమతుల ప్రధానోత్సవ కమిటీ కన్వీనర్ యు. భాస్కర్ నేతత్వంలో సాగిన ఈ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త, శ్రీ సూర్య శ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకష్ణ, యన్.టి.ఆర్. కళా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబు విజేతలకు, ప్రతిభావంతులకు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, బాలోత్సవ కమిటీ అధ్యక్ష-ప్రధాన కార్యదర్శులు బండారు లక్ష్మీనారాయణ, కె.సుబ్రహ్మణ్యం, జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు ఏ.వి.పుల్లారావు, డాక్టర్ అనుశ్రీ, బాలోత్సవ కమిటీ కోశాధికారి ఎస్ రవి, కమిటీ సభ్యులు అబ్దుల్ హై, పి. రాజ సులోచన,జి ఉమామహేశ్వరి, దామా శ్రీనివాసరావు, వి.బాల కోటయ్య, సి.హెచ్.వినోద్, కె.యఫ్.బాబు, యన్.చిన్నస్వామి, డి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు..

బాలోత్సవం పిల్లల పండుగ వేడుక సందర్భంగా పివిఆర్ గ్రౌండ్స్ లో ఏర్పాటుచేసిన పలు సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా స్థానిక ఎపెక్స్ స్కూల్ ఉపాధ్యాయుడు కాశి గైడెన్స్ లో ఎనిమిదో తరగతి విద్యార్థి ఈశ్వర్ రూపొందించిన 'స్మార్ట్ కళ్ళజోడు' ఆకర్షించింది. అంధులు కళ్ళజోడు ధరించి రోడ్డున నడిచేప్పుడు ఏదైనా వాహనం ఏ వస్తువైనా ఎదురు పడినప్పుడు హెచ్చరిక సంకేతం అందించే విధంగా తయారుచేసిన విద్యార్థినిని స్టాల్స్ సందర్శించిన శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ ప్రశంసించారు. శర్మ స్కూలుకు చెందిన సైన్స్ టీచర్ ఐ రామలక్ష్మి గైడెన్స్ లో వి.మనుశాయి పవన్ రూపొందించిన మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఆకట్టుకుంది. సత్యసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి ఎం.దేవశ్రీ నందన్ పర్యావరణం పరిరక్షణపై రూపొందించిన ప్రాజెక్టు ఆకర్షించింది. సింగరాయకొండ సెయింట్ జాన్స్ విద్యార్థులు చంద్రమౌళి చేతన్ కార్తికేయ ఆదిత్యలు తయారుచేసిన సోలార్ సైకిల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎనిమిది వేదికలపై లఘు నాటికలు, విచిత్ర వేషధారణలు,, ఏకపాత్రాభినయాలు, మూకాభినయం, శాస్త్రీయ నత్యం కోలాటం వ్యాసరచన, ముగ్గులతో గణితం, చిత్రలేఖనం జానపద కళలు, వ్యాసరచన వక్తత్వ పోటీలు ఆకట్టుకున్నాయి. రెండు క్యాంపస్‌లలలో 55 విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి జరిగిన పలు కార్యక్రమాలు ఆసక్తిదాయకంగా కొనసాగాయి. ఆద్యంతం విజ్ఞాన దాయకంగా, ఉత్సాహభరితంగా సాగిన ఈ కార్యక్రమాలు బాలల్లో సంతోషం నింపాయి.



రైతుల వేషధారణలో చిన్నారులు



మట్టితో బొమ్మలు తయారుచేస్తున్న విద్యార్థులు



విద్యార్థులు ప్రదర్శించిన సోలార్ సైకిల్



బాలోత్సవానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జనార్ధన్



విద్యార్థులకు కుర్చీలు అందచేస్తున్న దాత చింతా తిరుపతిరెడ్డి

గురుకుల విద్యార్థులకు కుర్చీలు బహూకరణ

ప్రజాశక్తి-దర్శి

స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎస్‌విఎస్ పాఠశాల కరస్పాండెంట్ చింతా తిరుపతిరెడ్డి 20 కుర్చీలు విద్యార్థులకు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రిన్సిపల్ మాధవరావు అధ్యక్షతన 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసేటప్పుడు తీసుకోవలసిన మెలకువలను ఆదివారం మానవతా సంస్థ సభ్యులు ఏర్పాటు చేసిన సభలో వివరించారు. పరీక్షల్లో ఏకాగ్రత శక్తితో ధృఢమైన ఆరోగ్యంగా ఉండాలని, మానసికంగా పరీక్ష అంటే భయం లేకుండా ఉంటే బాగా రాయొచ్చని మానవతా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, బసవయ్య, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

సహాయ సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి పరిధిలోని 11 సహాయ సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ఆదివారం క్రీడా సామాగ్రిని అందజేశారు. 10 రకాల స్టేషనరీ ఐటమ్స్‌ను, టవల్స్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా పంపిణీ చేసినట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి దర్శి షేక్ రాబియా బేగం తెలిపారు.

విప్లవ పార్టీల ఐక్యత అవసరం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విప్లవ పార్టీల ఐక్యత చారిత్రక అవసరమని, విజయవాడ నగరంలో ఈనెల 23న జరిగే విప్లవ పార్టీల ఐక్యత సభను జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక మాదాల నారాయణ స్వామి భవనంలో విప్లవ పార్టీల ఐక్యత సభ గోడ పత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ాయన మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం నక్షల్బరిలో ప్రారంభమైన పోరాటం విప్లవ పంథాను స్వీకరించి, విప్లవమే లక్ష్యంగా పీడిత ప్రజలను సమీకరించే లక్ష్యంతో పార్టీలు బయలు దేరారని అన్నారు. ఈ 50 సంవత్సరాల కాలం అనేక విజయాలు సాధించినప్పటికి అనేక చీలికలు ఏర్పడ్డాయని అన్నారు. ఫలితంగా విప్లవోద్యమానికి తీవ్ర నష్టం ఏర్పడిందని అన్నారు. ఈ క్రమంలో 2013లో న్యూ డెమోక్రసీ పార్టీలో ఏర్పడిన చీలికలను సమీక్షించుకొని, ఈ చీలకల వల్ల ఎక్కువ నష్టాలు ఉన్నాయని భావించి, చీలికలను నివారించడానికి రెండు న్యూడెమోక్రసీ పార్టీలు ఈనెల 23న విజయవాడ కేంద్రంగా ఐక్యం కాబోతున్నా యని అన్నారు. దేశంలో పెరుగుతున్న ఫాసిజం, రాజ్యాం గాన్ని గౌరవించకుండా, పీడిత ప్రజల హక్కులను హరిస్తూ, ఒకే దేశం, ఒకే చట్టం పేరుతో దేశంలోని వివిధ మతాలు, కులాలు, ఆచారాలు, సాంప్రదాయాలను గౌరవించకుండా, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఈ మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా దేశంలోని విప్లవ, దళిత, వామపక్ష శక్తులు సంఘటితంగా పోరాడాలని అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య లపై వామపక్ష పార్టీలు ఐక్య పోరాటాలు కొనసాగించాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సిఎస్ సాగర్, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పద్మ, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు జాలన్న, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు కె నాంచార్లు. ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్ మోహన్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ రాజశేఖర్, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్ భారతి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్యాం పాల్గొన్నారు.

తెలుగు జాతి కీర్తి పతాక 'శ్రీకృష్ణదేవరాయలు'

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశభాషలందు తెలుగు లెస్సని ఎలుగెత్తి చాటిన శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తితో అందరూ తెలుగు భాషాభివృద్ధికి పునరంకితం కావాలని సాహితీ వేత్తలు కోరారు. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో తెలుగు వల్లభుని 554వ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు మాట్లాడుతూ 500 ళ్ల నాడే తెలుగు భాషకు, జాతికి, తెలుగు నేలకు విశిష్ట ఖ్యాతిని కల్పించిన తెలుగు జాతి కీర్తి పతాక రాయలవారిని స్మరించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంగీతం, సాహిత్యం, చిత్ర లేఖనం, నాట్యం, శిల్పం వంటి లలిత కళలకు కృష్ణ రాయల పరిపాలనాయుగం స్వర్ణ యుగం వంటిదన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ నారపుశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషకు పూర్వ వైభవాన్ని చేకూర్చడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. నాగభైరవ కళా పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ తాను చేసిన యుద్ధంలోనూ ఓటమి ఎరుగని చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలని అన్నారు. యుద్ధ విరామ సమయాల్లో కవి సమ్మేళనాలు, సాహితీ గోష్ఠులు నిర్వహించారని అన్నారు. సాహితీ సమరాంగణ సార్వభౌముడు కృష్ణ దేవరాయల వైభవాన్ని ప్రస్తుత తరానికి చాటి చెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. లలిత కళా అకాడమీ అధ్యక్షులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతాంధ్ర, కన్నడ భాషలలో తిరుగు లేని భాషా పటిమ ఉన్న కవి చక్రవర్తి కృష్ణదేవరాయలని, ప్రకృతి వర్ణనలకు, గ్రామీణ వాతావరణానికి ఆయన రచించిన 'ఆముక్తమాల్యద' అద్దం పడుతుంద న్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకు లు తూము సుబ్బారావు, వివిధ సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు మిడసల మల్లికార్జున రావు, జి ఓబుల్‌రెడ్డి, మాగంటి శ్రీనివాసమూర్తి, మెడబలిమి సాంబశివరావు, మొగిలి దేవప్రసాద్, పి గోవర్ధన్‌రెడ్డి, ఐ మురళీకృష్ణ, మద్దులూరి వెంకట సుబ్బారావు, వల్లెపు మురళి, కొప్పోలు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సాహితీవేత్తలు

సమస్యల వలయంలో కొనకనమిట్ల

పట్టించుకోని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి - కొనకనమిట్ల

మండల కేంద్రమైన కొనకనమిట్లలో సమస్యలు కోకొల్లలు. గ్రామంలోని ప్రధాన రహదారులు కుంచుకు పోయాయి. రోడ్డుకు ఇరువైపు ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో వర్షాలు కురిసినప్పుడు నీరు పోయే మార్గం లేక ఎక్కడి నీరు అక్కడే నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లు తోంది. గ్రామంలో పంచాయతీ కార్మికులు ఉన్నప్పటికీ పనులు నామ మాత్రమే. పంచాయతీలోని అన్ని వీధుల్లో పనులు చేయాల్సి ఉండగా బస్టాండ్ కూడాల్లో మాత్రమే నామ మాత్రంగా శుభ్రం చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. పాత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. సైడ్ కాలువల్లో మురికి పేరుకుపోయి దుర్గంధం వెదగజల్లుతుంది. ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి చెట్లు ఏపుగా పెరిగి దారి కుంచుకుపోయింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. పారిశుద్ధ కార్యక్రమాలు నామ మాత్రంగా చేస్తూ బిల్లులు మాత్రం పూర్తి స్థాయిలో తీసుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. బస్టాండ్ కూడాల్లో ఏర్పాటు చేసిన సెంటర్ లైట్ విద్యుత్ దీపాలు గత మూడేళ్లుగా వెలుగుకు నోసుకోలేదు. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌కు రావాలన్నా, వెళ్లాలన్న చీకట్లోనే అవస్థలు పడాల్సి వస్తుంది. అనేకసార్లు సమావేశాల్లో అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. రాత్రి సమయాల్లో బస్టాండ్ కూడాల్లో ఆగి ఉన్న వాహనాలను ఢీకొని మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కానీ అధికారులు, ప్రజా ప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎస్సీ, బీసీ కాలనీలలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీపాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. హిందూ పాఠశాలకు వెళ్ళే రహదారి అధ్వానంగా తయారైంది. దీంతో విద్యార్థులు ఆదారిన వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి అధికారులు బస్టాండ్ కూడలిలో నిర్మించాల్సిన షెల్టర్‌ను దూరంగా ఏర్పాటు చేశారు. అది ప్రయాణికులకు ఉపయోగంగా లేక అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ బస్సులకు స్టేజి ఉంది. అందువల్ల కొనకనమిట్ల పంచాయతీ ప్రయాణికులతోపాటు వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇక్కడకు వస్తుంటారు. బస్టాండ్ కూడలిలో షెల్టర్ లేక చిరువ్యాపారుల పంచన చేరాల్చిన దుస్థితి ఏర్పడింది. అంతే కాకుండా బస్సులు కోసం వేచి ఉండే ప్రయాణికులకు షెల్టటర్, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటులో పాలకులు, అధికారులు వైఫల్యం చెందారు. దీంతో వీధుల్లోని, ఇళ్లలోని, చిరు వ్యాపారుల వద్ద పోగైన చెత్తా చెదారాన్ని ఎక్కడ బడితే అక్కడ పడవేస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు వృధా చెత్తలోని దుర్గంధం వల్ల గ్రామస్తులకు వ్యాధులు సంభవిస్తున్నాయి. ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వ వసతి గృహం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రామీణ గ్రంథాలయం ఉండేది. ఇది విజ్ఞానాన్ని పెంపొందించుకు నేందుకు దోహదపడేది. విద్యార్థులు, వృద్ధులు దిన పత్రికలు, జనరల్ నాలెడ్జి పెంపొందించుకునే పుస్తకాలు చదవాలంటే అందుబాటులో లేవు. పేరుకే మండల కేంద్రం. సరిపడా వసతులు ఏర్పాటు చేయడంలో పాలకులు, అధికారులు వైఫల్యం చెందారాని పలువురు విమర్శిస్తున్నారు. ఇన్ని సమస్యలతో సతమతం అవుతోన్న మండల కేంద్రాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని వసతులు కల్పించాలని పంచాయితీ ప్రజలు కోరుతున్నారు.



స్టేషన్‌పల్లెకు వేళ్లే రహదారి



దూరంగా ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్



పిచ్చి చెట్లతో కుంచించు కుపోయిన ఎస్సీ కాలనీ రహదారి

పంటలన్నీ కోతకు రావడంతో కూలీలకు డిమాండ్

- ఒకేసారి కోతకు వచ్చిన కంది, వైట్‌బర్లీ, మిరప, వరి పంటలు
- అదునులో కొయ్యకపోతే నష్టపోతామనే ఆందోళన

ప్రజాశక్తి-దర్శి

రైతులు పండించిన పంటలు అన్నీ ఒకేసారి కోతకు వచ్చాయి. దీంతో కూలీలకు బాగా డిమాండ్ పెరిగింది. రైతులు నాగార్జున సాగర్ కాలువ పరిధిలో వేసిన వరి పంట కోతలకు రావడంతో కూలీలకు ఒకసారిగా డిమాండ్ పెరిగింది. కంది, వైట్ బర్లి, మిరప పంటలు కూడా ఇదే సమయంలో కోతకు రావటంతో రైతులందరూ కూలీల కోసం ఎదురు చూస్తున్నారు. దీనితో మండలంలోని రాజంపల్లి గ్రామంలో ఆదివారం పెద్ద ఎత్తున ట్రాక్టర్లు, ఆటోల్లో చదువుకునే పిల్లలు కూడా కూలి పనులకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా రైతు అంకిరెడ్డి మాట్లాడుతూ తాను మూడు ఎకరాలు వైట్ బర్లి పొగాకు వేశానని, దాని కోసం ఒక్కొక్కరికి రోజుకు రూ.700 కూలీ ఇచ్చే లెక్కన ట్రాక్టర్‌లో 20 మందిని తీసుకొని వెళు తున్నట్లు తెలిపారు. ముఠాలుగా ఏర్పడిన కూలీల కోసం రైతులందరూ ట్రాక్టర్లు, ఆటోల్లో కూలీలను తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మండలంలోని కుంచెపల్లికి చెందిన రైతు వెంకటేశ్వర్లు కంది పంట కోసం రూ.700 కూలీలు చెల్లించే విధంగా ట్రాక్టర్లో కూలీలను తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఏ పనికి వెళ్లిన కూలీలకు రూ.500 తక్కువ ఇవ్వటం లేదని కూలిల మేస్త్రి రత్నమ్మ తెలిపారు. ఆమె మిరపకాయల కోతకు రాజంపల్లిలో ట్రాక్టర్లపై కూలీలను తీసుకుని వెళుతున్నట్లు తెలిపారు. పంటలన్నీ ఒకసారి చేతికందడంతో రైతులకు కూలీల అవసరం పెరిగిందని తెలిపారు. దీంతో అధిక కూలీ చెల్లించైనా అదునులో కోత కోయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు.



పొలాల పనులు కోసం ట్రాక్టర్లు, ఆటోల్లో వెళ్తున్న కూలీలు

ప్రజాశక్తి
7
సోమవారం 17 ఫిబ్రవరి 2025

అద్దంకి నాగేశ్వరరావుకు కళా పురస్కారం

ప్రజాశక్తి-అద్దంకి

నాటకరంగంలో అపూర్వ ప్రతిభ కనబరచి వేలాది ప్రదర్శనలతో ప్రేక్షకులను మెప్పించిన ప్రముఖ నటుడు అద్దంకి (తన్నీరు) నాగేశ్వరరావుకు "పుట్టంరాజు బుల్లెయ్య-రామలక్ష్మమ్మల విశిష్ట కళాపురస్కారం-2025"ను సాహితీ కౌముది ఆధ్వర్యంలో అందజేశారు. అద్దంకిలోని పుట్టంరాజు కళాక్షేత్రం వేదికగా జరిగిన ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో సాహితీ, నాటకరంగ ప్రముఖులు, సాంస్కృతిక వేత్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పురస్కార గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు. సుదీర్ఘ కాలంగా రంగస్థల నటనకు అంకితభావంతో పనిచేసి 3 వేలకు పైగా నాటక ప్రదర్శనల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందిన నాగేశ్వరరావు సేవలను సభలో పలువురు ప్రముఖులు ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి వారణాసి రఘురామశర్మ అధ్యక్షత వహించారు. కళలు దైవదత్తాలని, కళలు సాధనతో ప్రకాశిస్తాయని తన్నీరు నాగేశ్వరరావు అకుంఠిత సాధనతో విభిన్నపాత్రల్లో రాణించి ప్రేక్షకుల ప్రశంసలందుకున్న సీనియర్ నటుడని, ప్రతిభాశాలని వారణాశి రఘురామశర్మ అన్నారు. ఏపీసీడీసీఎల్ ఈఈ నల్లూరి మస్తాన్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నాగేశ్వరరావు రంగస్థల సేవలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం అన్నారు. వారి ప్రతిభకు ఈ పురస్కారం గౌరవ సూచకం అని పేర్కొన్నారు. గాడేపల్లి దివాకర దత్తు, డి.వి.యం. సత్యనారాయణ, శ్రీ చప్పిడివీరయ్య తదితరులు ప్రసంగిస్తూ నాగేశ్వరరావు నటనా వైశిష్ట్యాన్ని ప్రశంసించారు. పురస్కారం అందుకున్న అనంతరం అద్దంకి నాగేశ్వరరావు మాట్లాడారు. 'నాటకరంగం నా ప్రాణం. ఇది ఒక కళ మాత్రమే కాదు. ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసే గొప్ప సాధనం. ఈ గుర్తింపు నాకు మరింత బాధ్యతను పెంచింది. కొత్త తరం నాటకరంగం వైపు ఆకర్షితులవ్వాలని నా ఆకాంక్ష' అన్నారు.



అద్దంకి నాగేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ఈ పురస్కారాన్ని పుట్టంరాజు బుల్లెయ్య -రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్ట్ తరపున పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు అందజేశారు. పురస్కార గ్రహీతకు రూ.5 వేలు నగదు, పట్టువస్త్రాలు, జ్ఞాపిక సమర్పించారు. ఈ పురస్కార ప్రదానోత్సవం అద్దంకిలో సాహితీ, నాటకరంగ ప్రియులకు మరపురాని సందర్భంగా నిలిచిపోతుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సాహితీ కౌముది, పుట్టంరాజు బుల్లెయ్య-రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను పలువురు ప్రశంసించారు. విజయవాడ ఏపి సీపీడీసీల్ పరిధిలో అద్దంకి డివిజన్‌ను ఉత్తమ డివిజన్‌గా తీర్చిదిద్ది విద్యుత్ శాఖ అధికారుల ద్వారా అవార్డు స్వీకరించిన ఈఈ నల్లూరి మస్తాన్ రావుని సాహితీ కౌముది సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె.వి. పోలిరెడ్డి, చుండూరి మురళీ సుధాకరరావు, కొండకావూరి కుమార్, ఆర్.రాజశేఖర్, కుందా సుబ్బారావు, కూరపాటి రామకోటేశ్వరరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, కంఠంరాజు శివరామ కోటేశ్వరరావు, కడియం పాపారావు, చిరంజీవి, జిల్లారంగభూమి కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ధేనువకొండ సుబ్బయ్య, అంగలకుర్తి ప్రసాదు తదితరులు పాల్గొని నాగేశ్వరరావుకి శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యుత్ ఏఈ నిర్లక్ష్యం లేదు

ఏడీఈ జె.శ్రీనివాసులు

ప్రజాశక్తి-వేటపాలెం

దళిత వైద్యుని వ్యవసాయ భూమికి విద్యుత్తు కనెక్షన్ ఇవ్వకుండా విద్యుత్ ఏఈ కాలయాపన చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనంలో వాస్తవం లేదని ఏడీఈ జె.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఈ విషయంపై ఏడీఈ ప్రకటన విడుదల చేశారు. దళిత వైద్యుడి వ్యవసాయ భూమిలో ఒక షెడ్డు నిర్మాణం జరుగుతుంది. ఇందుకు గాను కేటగిరి-1 విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేశారు. ఫీల్డ్‌లో వెరిఫై చేయగా షెడ్డు స్తోంభం నుంచి దాదాపుగా 70 మీటర్ల దూరంలో ఉంది. అంత దూరం విద్యుత్ మీటరు ఇవ్వడం సాధ్యపడదని అధికారులు తెలిపారు. స్తంభాలకు ఎస్టిమేట్ వేస్తే మేము డిమాండ్ పే చేస్తామని వైద్యుడు తెలిపారు. ఈ మేరకు ఏఈ ఎస్టిమేస్ వేసి వేయగా డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిశీలించి డిమాండ్ నోటీస్ వైద్యుడికి అందజేశారు. పేమెంట్ చేసిన వెంటే స్తంభాలు ఎత్తి మీటరు బిగిస్తామని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఎటువంటి పేమెంట్ జరగలేదు. ఇందులో విద్యుత్ ఏఈ భాస్కర్ ఎటువంటి నిర్లక్ష్యం వహించలేదు.' అని ప్రకటనలో ఏడీఈ వివరించారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ బాపట్ల జిల్లా చైర్మన్‌గా

వెంకట నాగ శివప్రసాద్

ప్రజాశక్తి-బాపట్ల

ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ బాపట్ల జిల్లా ప్రజా సంబంధ విభాగానికి చైర్మన్‌గా మోటుమర్రి వెంకట నాగ శివప్రసాద్ నియమితులైనట్లు హ్యూమన్ రైట్స్ జిల్లా ఇంచార్జ్ బండ్రెడ్డి అంకమ్మరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. గుంటూరు బిఆర్ స్టేడియం రోడ్డులోని జాతీయ కార్యాలయంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ షేక్ సిరాజుద్దీన్ ఈ మేరకు శివప్రసాద్‌కు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వెంకట నాగ శివప్రసాద్ మాట్లాడుతూ పేదలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, ప్రజల యొక్క సమస్యలను చట్టపరంగా న్యాయపరంగా తీర్చడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నిరుపేదలకు విద్యా వైద్య సహకారాలు అందిస్తూ ప్రభుత్వం నుంచి రావలసిన పథకాలు పేదలకు అందేలా, అలాగే చట్టాన్ని న్యాయస్థానాన్ని గౌరవిస్తూ బాపట్ల జిల్లాలో మానవ హక్కులకు భంగం కలిగించే వారిపై న్యాయపరంగా చట్టపరంగా పోరాడుతానన్నారు. సభలో రాష్ట్ర కమిటీ మెంబర్ భగవతుల ప్రసాద్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ ఖాదర్, జిల్లా వైస్ చైర్మన్ కొండలరావు పాల్గొన్నారు.

సచివాలయాలు ఎప్పటికి పూర్తయ్యేనో..?

పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రజాశక్తి-తర్లుపాడు

మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. కొన్ని భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ నిరుపయోగంగా పడి ఉన్నాయి. చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు అల్లుకుపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. ఈ భవనాల్లో పగిలిన మద్యం సీసాలు పాలకులు, అధికారుల తీరును ప్రశ్నిస్తున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు ఆర్‌బికె భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడం గమనార్హం. కొన్ని నిర్మాణాలు ఊరికి దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మీర్జాపేట సచివాలయం, ఆర్‌బికె కేంద్రాల వద్ద మందుబాబులు మద్యం సేవించి సీసాలు పగలగొట్టి పడేస్తున్నారు. మండల కేంద్రమైన తర్లుపాడు సచివాలయం పూర్తయినా నిరుపయోగంగానే ఉండటం వలన చుట్టుపక్కల నివాసాలలోని ప్రజలు చెత్తాచెదారాలు వేయడంతో డంపింగ్ యార్డుగా మారింది. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలు ఉపయోగంలోకి తేకుండానే శిథిలం అయ్యే స్థితికి చేరుతున్నాయి.

రిబ్బన్ కట్ చేసి.. వదిలేశారు

జన సమీకరణ చేసి.. ఆర్భాటంగా రిబ్బన్ కత్తిరించి ఆరంభించిన భవనాలు నేటికీ వినియోగంలోకి రాలేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు ఖాళీగా దర్శనమిస్తూ.. పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. వినియోగంలోకి తీసుకురాకుండా పెద్ద పెద్ద భవనాలు నిర్మిస్తే మాత్రం ఏం లాభం అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు భవనాలు ప్రారంభించడానికి చూపిన శ్రద్ధ, వినియోగంలోకి తీసుకురావడంపై చూపలేదని విమర్శిస్తున్నారు.



వినియోగంలో లేని తర్లుపాడు సచివాలయం

విద్యుత్తు లేదని తాళం వేశారు

మండలంలోని మీర్జాపేటలో రూ.40 లక్షలు ఖర్చు చేసి సచివాలయం, రూ.20 లక్షలతో ఆర్‌బికే కేంద్రాన్ని, అలాగే రూ.40 లక్షలతో తర్లుపాడు సచివాలయాన్ని నిర్మించారు. ఈ భవనాలను అప్పటి వైసిపి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, మండల ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారుల చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించారు. ఏడాదిన్నర కాలం పూర్తవుతున్నా నేటికీ సేవలు ప్రారంభించలేదు. ఆ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. విద్యుత్ సౌకర్యం లేదనే కారణంగా పంచాయతీ కార్యాలయంలో, పాత స్కూల్ బిల్డింగ్‌లో, అద్దె గృహాలలో సేవలందిస్తున్నారు. ఆ భవనాలు శిథిలం అవడంతో బిక్కిబిక్కుమంటూ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పూర్తయిన భవనాలకు విద్యుత్ ఇవ్వడంలో ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు సమాచారం. నూతన భవనాలకు విద్యుత్ ఇవ్వాలని కాంట్రాక్టర్లు, ప్రజలు కోరినప్పటికీ నిర్లక్ష్యం వేయటం లేదని గుసగుసలు అనిపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సచివాలయాలు, రైతు భరోసా కేంద్ర భవనాలను పూర్తిచేయాలని, పూర్తయిన భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజాధనాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-బాపట్ల

వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని టౌన్ హాల్లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఆదివారం బాపట్ల వేగేశన ఫౌండేషన్, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, ఉమ్మడి గుంటూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శంకర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తనయుడు రాకేష్ వర్మ ప్రారంభించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ మారియా ఫరూకీ, అనూష, పేరా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారిని దర్శించుకున్న చీరాల ఎమ్మెల్యే కొండయ్య

ఎమ్మెల్యే కొండయ్య ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పర్చూరు

మండలంలోని చెరుకూరులో శ్రీ త్రివిక్రమ, శ్రీ అగస్త్యేశ్వర స్వామి వార్ల దేవాలయాలను ఆదివారం చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య సందర్శించారు. స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. పూజలు చేసిన అనంత తీర్థ ప్రసాదం స్వీకరించారు. స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. దేవాలయాల కార్యనిర్వాహణాధికారి ఎం.నాగయ్య, అర్చకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన నాగులుప్పలపాడులో జరిగింది. బాధితుడు తెలిపిన వివరా లు మేరకు.. నాగులుప్పలపాడు గ్రామానికి చెందిన తోకల వెంకటేశ్వర్లుకు చెందిన పొగాకు బ్యారన్‌లో ఆదివారం క్యూరింగ్ జరుగుతుండగా పొగాకు కర్రలు మొద్దు గొట్టంపై పడి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఒంగోలు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. మంటల ధాటికి పక్కనే ఉన్న వెంకటేశ్వర్లు సోదరుడు రామారావుకు చెందిన బ్యారెన్ టైర్లు సైతం కాలిపోయాయి. అగ్ని ప్రమాదంలో సుమారు ఎనిమిది లక్షల పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.



ట్యాంకును క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి

ప్రజాశక్తి-పర్చూరు

తాగునీటి ట్యాంకులను, బావులను క్లోరినేషన్ చేయాలని ఆర్డబ్ల్యూఎస్ డీఈ ఎస్.సతీష్ చంద్ర పంచాయతీ అధికారులకు సూచించారు. బర్డ్ ఫ్లూ హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని అన్నం పొట్లవారిపాలెం తాగునీటి సరఫరా పథకాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. క్లోరినేషన్‌ను దగ్గరుండి పరిశీలించారు. తాగునీళ్లలో బ్యాక్టీరియా లేకుండా శుద్ధి చేయాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా బ్యాక్టీరియా వైరస్‌లకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈయన వెంట ఏఈ జి.శివ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చీరాల

సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం హావిష్ ఆర్థో క్లినిక్ ఆద్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సజ్జ చెన్నకేశవ రావు వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరంలో 60 మందికి పైగా రోగులకు వైద్య చికిత్స పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ప్రధాన కార్యదర్శి అత్తలూరు రామారావు, ముఖ్య సలహాదారు వివిఎస్ఆర్ శర్మ, బక్క జయరామిరెడ్డి, బత్తుల శామ్యూల్, జి.వెంకట్రావు, అచ్చుతుని బాబూరావు, కోట వేంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ తినలేం..మటన్ కొనలేం..

- కోడి మాంసం అమ్మకాలపై బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్
- 75 శాతం పైగా పడిపోయిన విక్రయాలు
- మటన్, చేపల వైపు ప్రజల మొగ్గు





ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బర్డ్ ఫ్లూ ప్రభావం జిల్లాపై పడింది. జిల్లాలో బర్డ్‌ఫ్లూ కేసులు లేకపోయినా 75 శాతం పైగా చికెన్ అమ్మకాలు పడిపోయాయి. జిల్లాలో ప్రస్తుతం చికెన్ తినలేని పరిస్థితి, మటన్ కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల భయాన్ని సొమ్ము చేసుకునేందుకు మటన్ వ్యాపారులు ధరలను అమాంతం పెంచారు. మొన్నటివరకు రూ.800 ఉన్న మటన్ ధర రూ.వెయ్యికి చేరింది. దీంతో తప్పనిసరి పరిస్థితులలో మటన్, చేపలను కొనుగోలు చేసేందుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎలాంటి కేసులు లేకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దని వ్యాపారులు కోరుతున్నారు.

ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ప్రభావం జిల్లాలో చికెన్ అమ్మకాలపై పడింది. 75 శాతం పైగా చికెన్ అమ్మకాలు నిలిచిపోయాయి. వినియోగదారులు చికెన్ స్టాల్లు వెలవెలబోయాయి. చికెన్ వ్యాపారులు అమ్మకాల కోసం కోళ్ళను సిద్ధం చేసి వినియోగదారుల కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రకాశం జిల్లాలో చికెన్ అమ్మకాలు జోరుగా సాగుతాయి. ప్రధానంగా రెస్టారెంట్లు, చిన్న చిన్న హెటళ్ళు, చికెన్ పకోడీ సెంటర్ల కోసం చికెన్‌ను అత్యధికంగా వినియోగిస్తారు. చిత్తూరు, పలమనేరు. అద్దంకి, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి కోళ్ళను తీసుకొని వస్తారు. అనంతరం వ్యాపారులు వినియోగదారులకు అందజేస్తారు. బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. 75 శాతం పైగా చికెన్ అమ్మకాలు నిలిచిపోవటం గమనార్హం.

మటన్, చేపల వైపు మొగ్గు

బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ తినటానికి ఇష్టపడని ప్రజలు మటన్, చేపలు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపారు. ప్రజల భయాన్ని దృష్టిలో ఉంచుకొని మటన్ వ్యాపారులు ధరలను అమాంతం పెంచారు. 10 రోజుల క్రితం వరకు కిలో మటన్ ధర రూ.800 ఉంటే ప్రస్తుతం 900-1000లు అమ్ముతున్నారు. ధర పెరిగినా తప్పనిసరి పరిస్థితులలో ప్రజలు మటన్ కొనుగోలు చేస్తున్నారు. ఒంగోలు నగరంలోని మటన్ షాపుల వద్ద ఆదివారం రద్దీ బాగా కనిపించింది. దీంతో పాటు చేపలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. 10 రోజుల వరకు కిలో చేప రూ.250-300 ఉంటే ప్రస్తుతం 500 వరకు వ్యాపారులు పెంచారు.

జిల్లాలో నమోదు కాని కేసులు

జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు ఏమీ నమోదు కాలేదు. అయినా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. చనిపోయిన కోళ్ళను తినవద్దని, చికెన్ తినే విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాకపోయినా కోళ్ళ వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

సోషల్ మీడియా ప్రచారంతో ఆందోళన

బర్డ్ ఫ్లూ వ్యాధిపై సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లో బర్డ్ ఫ్లూ ప్రబలింది. మిగిలిన జిల్లాల్లో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. యుట్యూబ్, ఇన్‌స్ట్రాగ్రామ్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాలో ప్రచారం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. చికెన్ తినేందుకు ప్రజలు ఆసక్తి చూపటం లేదు.

75 శాతం పైగా పడిపోయిన అమ్మకాలు

- రవి, చికెన్ హెూల్‌సేల్ వ్యాపారి

జిల్లాలో 75 శాతం పైగా చికెన్ అమ్మకాలు పడిపోయాయి. ఆదివారం వినియోగదారుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం హెూల్‌సేల్‌గా చికెన్ కిలో ధర రూ.218, రిటైల్ ధర రూ.230 ఉన్నా ప్రజలు కొనుగోలు చేయటానికి ఇష్టపడటం లేదు. సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారంతో అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. షాపుల నిర్వహణ, పనిచేసే వారికి జీతాలు ఇవ్వటం కష్టంగా మారుతోంది.

సోషల్ మీడియాలో ప్రచారం తగదు

- ఖలీల్, చికెన్ స్టాల్ యజమాని

బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు, ప్రచారం తగదు. ప్రకాశం జిల్లాలో కేసులు లేకపోయినా ప్రజలను భయభ్రాంతులు చేసేలా వస్తున్న ప్రచారంతో చికెన్ కొనటానికి ఎవరూ ముందుకు రావట్లేదు. మరో వారం ఇలా ఉంటే వ్యాపారం పూర్తిగా దెబ్బతింటుంది.



మాట్లాడుతున్న చుండూరి రవి

కార్యకర్తలకు అండగా ఉండాలి

వైసీపీ లీగల్ సెల్ బాధ్యులకు చుండూరి రవిబాబు విన్నపం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కార్యకర్తలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ అడ్వకేట్లు అండగా ఉండాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు కోరారు. జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఆ పార్టీ లీగల్ సెల్‌లో ఉన్న అడ్వకేట్లతో ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు నగరకంటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చుండూరి రవిబాబు మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలపై జరుగుతున్న అక్రమ దాడులు, పార్టీ నాయకులు, కార్యకర్తలపై నమోదు అవుతున్న అక్రమ కేసులను వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో లీగల్ సెల్ కీలక భూమిక పోషించాలని, పార్టీ కార్యకర్తలకు న్యాయపరంగా అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే కాలంలో లీగల్ సెల్ మరింత ప్రభావవంతంగా పనిచేసి పార్టీ కార్యకర్తలకు న్యాయ సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, ప్రవీణ్, బీసీ సెల్ నాయకులు బొట్ల సుబ్బారావు, పలువురు అడ్వకేట్లు పాల్గొన్నారు.

19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (డ్రాయింగ్, టైలరింగ్) పరీక్షలు'ఈనెల 19 నుంచి 22 వరకు జరుగుతాయని జిల్లా విద్యా శాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఒంగోలు రాంనగర్ మున్సిపల్ హైస్కూలు, ఏబిఎం జూనియర్ కళాశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును తీసుకెళ్లాలన్నారు.

విద్యుత్ అదాలత్‌ను వినియోగించుకోండి

ఎపిసిపిడిసిఎల్ ఈఈ మాకినేని హరిబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న ఒంగోలు డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాకినేని హరిబాబు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉన్న వినియోగదారులకు విజయవాడ ఆధ్వర్యంలో ఎపిసిపిడిసిఎల్ విజయవాడ ఆధ్వర్యంలో విద్యుత్ అవగాహన సదస్సు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుందన్నారు. విద్యుత్ అధికారులు ఈ అదాలత్ లో పాల్గొంటారన్నారు. ఒంగోలు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, మద్దిపాడు, టంగుటూరు, సంతనూతలపాడు మండలాల పరిధిలోని వినియోగదారుల ఫిర్యాదులను రాతపూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్ పూర్తి అడ్రస్‌తో వారి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

జిల్లా గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'చదవటం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. తదుపరి స్వాతంత్య్ర సమరయోధుల జీవిత విశేషాల కథలు చదివించటం, పిల్లలతో వారికి నచ్చిన బొమ్మలు వేయటం జరిగింది. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది యస్.అనిల్ బాబు, పి. ఇమ్మానుయేలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి భద్రతకే తొలి ప్రాధాన్యత

- 100 శాతం లక్ష్యాలు సాధించే దిశగా చర్యలు
- ఉప రవాణా కమిషనర్ సుశీల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో రహదారి ప్రమాదాలను నివారించటమే తొలి ప్రాధాన్యతగా పనిచేస్తున్నట్లు ఉప రవాణా కమిషనర్ రాయుడు సుశీల పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై నెల రోజుల పాటు జిల్లాలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించామన్నారు. జిల్లా రవాణా శాఖకు ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను 100 శాతం సాధించే దిశగా చర్యలు చేపట్టామన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించటం తప్పనిసరని అవగాహన కలిగిస్తున్నామన్నారు. జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి పోలీస్, మైనింగ్ శాఖల సహకారంతో అక్రమ రవాణాను కట్టడి చేస్తున్నామన్నారు. జిల్లా రవాణా శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను ఉప రవాణా కమిషనర్ ప్రజాశక్తికి వివరించారు. ఆ వివరాలన్నీ ఆమె మాటల్లోనే...

కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు జిల్లాలో ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నాం. హైవేలు, రాష్ట్ర రహదారులపై నిరంతరం తనిఖీలు చేస్తూ వాహనాల డ్రైవర్లు, ఆటోలు, ఇతర వాహనాల చోదకులకు ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిస్తున్నాం. అతి వేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడపటంపై దృష్టి సారించి, ప్రమాదాల వల్ల జరిగే నష్టాలపై ప్రజలు, వాహనదారులకు వివరిస్తున్నాం. అన్ని రోడ్డు ప్రమాదాలు ఫ్లో చార్ట్ ప్రకారం సంబంధిత లాగిన్స్ పోలీస్, రవాణా, ఎన్‌హెచ్ఎవి, వైద్య విభాగం ద్వారా ఐఆర్ఏడి(ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటా బేస్)లో నమోదు చేస్తున్నాం.



ముఖాముఖి

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు

రహదారి భద్రత, ప్రమాదాలు నివారించటంపై జిల్లాలో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించాం. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రోజుకొక కార్యక్రమం చేపట్టాం. ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం చేపట్టాం. ఆటో, లారీ డ్రైవర్ల ఆరోగ్య సమస్యలపై జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాం. మహిళలు హెల్మెట్ ధరించాలని కోరుతూ ఒంగోలు నగరంలో బైక్ ర్యాలీ చేపట్టాం. ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేశాం. జిల్లాలోని 8 నియోజకవర్గాలలో రహదారి ప్రమాదాల నివారణపై ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టాం. పాఠశాల, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ర్యాలీలు చేపట్టి అవగాహన కలిగించాం. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశాం.

నిర్దేశిత లక్ష్యాల సాధనకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం జిల్లా రవాణా శాఖకు 220 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించింది. వివిధ రకాల సేవలు, అన్ని లెర్నర్ లైసెన్సులు, డ్రైవింగ్ లైసెన్సులు, రవాణా, నాన్ ట్రాన్స్‌పోర్ట్ కొత్త రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు, జరిమానాల ద్వారా ఇప్పటి వరకు 80 శాతం లక్ష్యాలను సాధించాం. మోటార్ వాహన తనిఖీ అధికారులు, సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు, సిబ్బంది సహకారంతో రానున్న కాలంలో 100 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తాం.

హెల్మెట్, సీటు బెల్ట్ ధరించటం తప్పనిసరి

రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వాహన చోదకులు సీటు బెల్టు ధరించటం తప్పనిసరి. సుప్రీం కోర్టు తీర్పు మేరకు హెల్మెట్, సీటు బెల్టు ధరించటంపై ఎంవిఐ, ఏఎంవిఐలతో స్పెషల్ డ్రైవ్ చేపట్టాం.

గ్రానైట్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లా భూగర్భ, జల శాఖ, పోలీస్ శాఖ అధికారులతో కలసి జిల్లా రవాణా శాఖ అధికారులు పనిచేస్తున్నారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై నిరంతరం తనిఖీలు నిర్వహించి గ్రానైట్ అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నాం. గ్రానైట్ లారీలు, కంటైనర్లు ఒంగోలు నగరంలోకి ప్రవేశించకుండా ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ, కిమ్స్ హాస్పిటల్ మీదుగా కొత్త బైపాస్ రోడ్డు నుంచి సూరారెడ్డిపాలెం డంపింగ్ యార్డుకు చేరేలా రూట్ మ్యాప్ రూపొందించాం. రానున్న కాలంలో ఇతర శాఖల సహకారంతో జిల్లా రవాణా శాఖను అభివృద్ధి పథంలో నడిపేందుకు చర్యలు తీసుకుంటాం.